క్లుప్తంగా

నిధుల దుర్వినియోగంపై విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కాట్రపల్లి జీపీ కార్యాలయంలో శనివారం జిల్లా పంచాయతీ అధికారులు విచారణ చేపట్టారు. జీపీ నిధుల దుర్వినియోగం జరిగిందంటూ ఎంపీటీసీ రావుల అనిత కలెక్టర్‌కు గతంలో ఫిర్యాదు చేశారు. ఈమేరకు డీపీవో వీరబుచ్చయ్య, డీఎల్‌పీవో జి.లత విచారణ జరిపారు. ఎంపీవో సురేందర్, సర్పంచ్ కాసాగోని నిరోష, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

శంకరపట్నం: మండల కేంద్రంలో శనివారం రాష్ట్ర ఏఐటీసీయూ పిలుపు మేరకు మధ్యాహ్న భోజన కార్మికులు, ఏఐటీసీయూ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. రహదారిపై మానవహారంగా ఏర్పడి పెండింగ్ బిల్లులు చెల్లించాలని, సమస్యలను పరిష్కరించి డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సహనాబేగం, పిట్టల సమ్మయ్య, రజిత, పద్మ, లక్ష్మి, నాగమ్మ, స్వరూప పాల్గొన్నారు.

ఆవుల తరలింపును అడ్డుకున్న యువకులు



ఫిర్యాదు చేస్తున్న యువకులు

గంగాధర: మండల కేంద్రంలోని వారసంత నుంచి శనివారం ఆవులను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తొమ్మిది ఆవులను కొనుగోలు చేసిన ఓ వ్యాపారి వ్యాన్‌లో తరలిస్తుండగా మధురానగర్ చౌరస్తా సమీపంలో అడ్డుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయం

వీణవంక: రాబోయే ఎన్నికల్లో హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమని పార్టీ రాష్ట్ర నాయకుడు కట్కూరి మధుసూదన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని ఘన్ముక్కుల గ్రామంలో మాట్లాడారు. ఎమ్మెల్సీగా పాడి కౌశిక్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రూ.100కోట్ల అభివృద్ధి పనులు చేశారని, ప్రజలు కౌశిక్‌రెడ్డి పక్షానే ఉంటారని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, రైతులకు అండగా నిలిచారని కొనియాడారు. ఈకార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థికి నగదు ప్రోత్సాహకం



ప్రోత్సాహకం అందిస్తున్న వేణుకుమార్

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి కూకట్ల ప్రమోద్‌కుమార్ సదిశ ఫౌండేషన్ నిర్వహించిన గణితశాస్త్ర పోటీల్లో ప్రతిభ చూపాడు. శనివారం మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ నగదు ప్రోత్సాహకంగా అందజేశారు. కార్యక్రమంలో సదిశ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రవీణ్, నవీన్, ఆనంద్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, విద్యా కమిటీ చైర్మన్ బుర్ర సాయిలు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ పోల్ ట్యాక్స్ రద్దు చేయాలని వినతి



చొప్పదండి: ఎలక్ట్రికల్ పోల్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని కోరుతూ నియోజకవర్గంలోని కేబుల్ ఆపరేటర్లు శనివారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు వినతి పత్రం అందించారు. గతంలో వరంగల్‌లో జరిగిన సభలో సీఎం కేసీఆర్ ట్యాక్స్ రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, తాజాగా అధికారులు సర్వే నిర్వహిస్తూ ట్యాక్స్ వేస్తున్నారని వాపోయారు. రెండున్నర దశాబ్దాలుగా కేబుల్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మరిమడ్ల రాజు, తదితరులున్నారు.

ఆదరణ తగ్గని అంగళ్లు

- సూపర్‌మార్కెట్లు బలాదూర్
- ధరలు తక్కువ.. పేదలకు చేరువ
- ఒక్కో అంగడికి ప్రత్యేకత

హుజూరాబాద్: అంగడికి వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి.. లేకపోతే వారం రోజుల పాటు వేచి చూడాలి. లేదంటే అధిక ధరలకు సూపర్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఇదీ మధ్య తరగతి వారి మాట. అంగడితో పేద, మధ్య తరగతి వారికి ఉన్న అనుబంధం. కాలం, పరిస్థితులు మారినా, సూపర్ మార్కెట్‌లు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నా అంగళ్లకు ఆదరణ మాత్రం తగ్గడం లేదు. కాలంతో పనిలేకుండా అంగళ్లు జనంతో కళకళలాడుతున్నాయి. అంగడి రోజు వందలాది మంది సంచులు పట్టుకొని అంగడికి బయలుదేరడం కనిపిస్తోంది. గ్రామీణ ప్రజల జీవనశైలితో విడదీయలేని బంధం, పల్లె బతుకుల జీవన చిత్రానికి ప్రతిరూపంగా అంగళ్లు నిలుస్తున్నాయనడంలో సందేహం లేదు. వారానికి సరిపడా అన్ని రకాల వస్తువులకు అంగళ్లపై ఆధారపడుతుంటారు. జమ్మికుంట, హుజూరాబాద్ పట్టణాల్లో వారాంతపు అంగళ్లు నిర్వహిస్తున్నారు. అన్నిరకాల వస్తువులు



హుజూరాబాద్‌లో వారసంత

లభిస్తుండటంతో ఆదరణ తగ్గకపోగా ఆయా మున్సిపాలిటీలకు ఆదాయం కూడా లభిస్తుంది. పట్టణ వాసులు, ఉన్నత వర్గాలవారు కొత్త కొత్త షోరూంల పేర్లు చెబితే, గ్రామీణ ప్రాంత ప్రజలు మాత్రం అంగళ్లు గూర్చి చెబుతారు.

దశాబ్దాల చరిత్ర ..

హుజూరాబాద్, జమ్మికుంట అంగళ్లకు దశాబ్దాల చరిత్ర ఉంది. ఒక్కో పట్టణంలో ఒక్కో రోజు అంగడి జరగడం గమనార్హం. జమ్మికుంటలో మంగళవారం, హుజూరాబాద్‌లో గురువారం సంతలు నిర్వహిస్తారు. సరుకులు తక్కువ ధరకు లభిస్తుండటంతో గ్రామ, పట్టణ వాసులు ఆసక్తి చూపుతున్నారు. ఒక్కో అంగడికి ప్రత్యేకత ఉంది. జమ్మికుంట అంగడి మేకలు, ఎద్దుల క్రయవిక్రయాలకు ప్రత్యేకం, కూరగాయలు కూడా తక్కువ ధరకు లభిస్తాయి. జమ్మికుంట చుట్టు పక్కల గ్రామాల రైతులు పండించిన కూరగాయలను సంతలో విక్రయిస్తారు. హుజూరాబాద్ అంగడిలో కూరగాయలు, నిత్యావసర వస్తువులు, దుస్తులు తక్కువ ధరకు లభిస్తాయి. దీంతో కొనుగోలుదారులు అంగళ్ల బాట పడుతున్నారు. జమ్మికుంట మండలం నాగంపేటలో గురువారం జరిగే అంగడిలో మేకలు, ఎద్దుల విక్రయాల జోరుగా సాగుతాయి. ఇక్కడ నాణ్యమైన మేకలు, గొర్రెలు, మేలు రకం కాడెడ్లు లభిస్తుండటంతో కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల, గోదావరిఖనితో పాటు ఆయా ప్రాంతాలవారు క్రయవిక్రయాలు నిర్వహిస్తారంటే అంగళ్లకు ఉన్న ప్రత్యేకత తెలుస్తోంది.

అన్ని సరుకులు దొరుకుతాయి



జమ్మికుంటలో ప్రతివారం జరిగే అంగడిలో అన్నిరకాల సరుకులు, వస్తువులు దొరుకుతాయి. వారానికి సరిపడా కూరగాయలను ఒకేసారి తీసుకెళ్తాం. మిగతా రోజుల కంటే అంగడి రోజు ధరలు తక్కువగా ఉంటాయి. చుట్టుపక్కల గ్రామాల జనంతో అంగడి జాతరను తలపిస్తుంది.

– మార్క హేమలత, జమ్మికుంట

పదేళ్లుగా అంగడికి వస్తున్నా



పదేళ్లుగా అంగడిలో సరుకులు తీసుకుంటున్నాను. అంగడి రోడ్లమీదనే జరుగుతుండటంతో వచ్చిపోయేవాళ్లకు కొద్దిగా ఇబ్బందిగా ఉంటుంది. అంగడికి వచ్చే జనాలను దృష్టిలో పెట్టుకొని అన్ని సౌకర్యాలు కల్పించాలి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు అంగడి సూపర్ మార్కెట్.

– దుబాసి విజయదుర్గ, ఇందిరానగర్

మేకలు, గొర్రెలకు ఫేమస్



నాగంపేట అంగడి మేకలకు, గొర్రెలకు ఫేమస్. బెల్లంపల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చి విక్రయిస్తారు. చుట్టపక్కల గ్రామాల్లో ఏ ఫంక్షన్ ఉన్నా ఇక్కడికే వస్తారు. గతంలో జమ్మికుంట మార్కెట్‌కు వెళ్లేవారు. పెద్ద సంఖ్యలో మేకలు, గొర్రెల విక్రయాలు, కొనుగోలు చేస్తారు.

– నాగుల శంకర్‌లింగం, నాగంపేట

సామాజిక సేవలో భాగస్వాములవ్వాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రాజశేఖర్

జమ్మికుంట: చదువుతోపాటు సామాజిక సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. శనివారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీలత, స్టాఫ్ కార్యదర్శి రామ్మోహన్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎంబోడి రవి, లోఖండే రవీందర్, అధ్యాపకులు స్వరూప, సుష్మా, మహేందర్, ఈశ్వరయ్య, రవిప్రకాష్,సాయికుమార్, సుధకార్, ఎన్ఎస్ఎస్ వలీంటర్లు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం మండల కమిటీ

చిగురుమామిడి: చిగురుమామిడి మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శ్రీరామోజు రాజ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పి. తిరుపతి, ఉపాధ్యక్షుడిగా పి. సంతోష్, సీహెచ్ సంజీవు, సి. సది, కార్యదర్శులుగా ఏ సంపత్, జి బాబు, ఎం సంపత్, సంయుక్త కార్యదర్శులుగా కె శ్రీనివాస్, సి. శ్రీనివాస్, ప్రచారకార్యదర్శిగా ఎన్. దశరథం, కోశాధికారిగా ఎం. ప్రకాశ్, సోషల్‌మీడియా ఇన్‌చార్జిగా పి. రాజ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్ పర్శరాములు, కె రమేశ్, ఎం కుమారస్వామి, పి. రవీందర్, బి. రవి ఎన్నికయ్యారు. ఎన్నిక ఏకగ్రీవంగా సభ్యులందరి ఆమోదంతోనే జరిగిందని అధ్యక్షుడు రాజ్‌కుమార్ తెలిపారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పల్లె దవాఖానలను నిర్మిస్తుందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని కాట్నపల్లిలో శనివారం పల్లె దవాఖానకు, కొలిమికుంటలో ఆర్ఎంపీల భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం చొప్పదండిలోని వరలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందించారు. చొప్పదండిలో వందపడకల ఆసుపత్రిని నిర్మిస్తామని తెలిపారు. కొలిమికుంటకు చెందిన కొమ్ము అనసూర్య ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేల నగదు అందించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ చిలుక రవీందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెల్మ మల్లారెడ్డి, మినుపాల తిరుపతిరావు, చీకట్ల రాజశేఖర్, ఇప్పనపల్లి విజయలక్ష్మి, మాచర్ల వినయ్‌కుమార్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో ఎమ్మెల్యే రవిశంకర్ సెల్ఫీ

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

చిగురుమామిడి: విద్యార్థులకు మంచి విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ అవసరమని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీపీ కొత్త వినీత అన్నారు. శనివారం చిగురుమామిడి కేజీబీవీలో విద్యార్థుల తల్లిదండ్రులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... బడి నుంచి రాగా పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని అప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల సహాయసహకారాలు ఉండాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించినప్పుడు ఉపాధ్యాయుల విద్యాబోధనకు ఫలితం దక్కుతుందన్నారు. మండల మెడికల్ ఆఫీసర్లు ధర్మానాయక్, హఫసానా, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’ పత్రాలు అందజేత

గన్నేరువరం: ప్రజా సంక్షేమానికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. గృహలక్ష్మి పథకంలో భాగంగా మాదాపూర్‌లో శనివారం ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలో గృహలక్ష్మి పత్రాలను అందజేశారు. ఇల్లులేని నిరుపేదలకు ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్న గ్రామాల్లోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తుందని, ఇంటి స్థలం ఉన్నవారికి రూ.3 లక్షలు అందిస్తున్నామని తెలిపారు. ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ గ్యారెంటీ కార్డుతో ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తోందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో స్వాతి, వైస్ ఎంపీపీ స్వప్న, బీఆర్‌ఎస్ మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకన్న, సహకార సంఘం మాజీ చైర్మన్ కోటీ, సర్పంచు లక్ష్మీ, శ్రీమానసాదేవి ఆలయ చైర్మన్ చంద్రారెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మన్మోహన్‌రావు, కోటేశ్వర్, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



పత్రాలందిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

చిగురుమామిడి: రైతులు మంచి దిగుబడినిచ్చే ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించి ఆర్థికంగా బలోపేతం కావాలని మండల ఉద్యానశాఖ అధికారి బుర్ర మంజువాణి అన్నారు. శనివారం మండలంలోని గునుకులపల్లెలో ఆయిల్‌పామ్ సాగుతో పాటు ఈజీఎస్‌లో హార్టికల్చర్‌పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వరి, మొక్క జొన్న, పత్తి, ఇతర ఆరుతడి పంటల కంటే ఎంతో లాభదాయకమని, ఆసక్తిగల రైతులు సంప్రదించాలని కోరారు. సదస్సులో సర్పంచ్ గునుకుల మంజులారెడ్డి, ఉపసర్పంచ్ కూన పోచయ్య, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ కరివేద మహేందర్‌రెడ్డి, ఏఓ రంజిత్‌కుమార్, ఏఈఓ సతీష్, లోహియా ఫీల్డ్ ఆఫీసర్ దోమల ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

సేంద్రీయ పంటలతో ఆరోగ్యం

గంగాధర: సేంద్రీయ పద్ధతిలో సాగు చేసిన పంటలతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని కేవీకే సైంటిస్ట్ వేణుగోపాల్, ఫాతిమానగర్ అడోరేషన్ డైరెక్టర్ సిస్టర్ ప్రీతా రైతులకు సూచించారు. మండలంలోని కొండన్నపల్లి, హిమ్మత్‌నగర్ గ్రామాల్లో అడోరేషన్ ఆధ్వర్యంలో రైతులకు ఐదురకాల కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జమున–శ్రీనివాస్, ఉపసర్పంచ్ ప్రభాకర్, సంస్థ కోఆర్డినేటర్లు సిస్టర్ దీప్తి, అరుణ, ప్రతినిధులు మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, రూప, స్రవంతి, మౌనిక పాల్గొన్నారు.



గంగాధర: విత్తనాలు అందజేస్తున్న డైరెక్టర్

స్వచ్ఛతా హీ సేవా

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.పి. ఇందిరాదేవి మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, చెత్తలేని, ప్లాస్టిక్ రహిత పరిసరాల ఏర్పాటుకు చిత్తశుద్ధితో నిరంతరం కృషి చేయాలన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.హరిప్రసాద్, కళాశాల సిబ్బంది, విద్యార్థులతో స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీనరసింహమూర్తి, ఐక్యూఏసీకో ఆర్డినేటర్ డా.పి. దినకర్, అకడమిక్ కో ఆర్డినేటర్ డా.జి.శ్రీనివాస్, కల్చరల్ కో ఆర్డినేటర్ ఎస్.మధు, బోధనేతర సిబ్బంది పాష, రాజ్ కుమార్, శ్రీలత, రమేష్, స్పందన, ఎన్.ఎస్.ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ర్యాలీ, శ్రమదానం కార్యక్రమాలను ఎంపీడీఓ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే ఎంఆర్‌సీ భవనం ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ వీధులు శుభ్రంచేశారు. ఏపీఎం రమాదేవి, ఏపీఓ రవి, ఆయా జీపీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యప్రసన్న, ఉపసర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఏపీవో రాధ, కార్యదర్శి పాషా, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

హుజూరాబాద్: వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఎస్సారెస్పీ కెనాల్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.

అన్నదానం, నిమజ్జనం, ప్రత్యేక పూజలు

చొప్పదండి: పట్టణంలోని వీణాధరి ఉన్నత పాఠశాల ఎదుట ఏర్పాటు చేసిన గణనాథుడిని శనివారం నిమజ్జనం చేశారు.

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల గ్రామం యాదవకాలనీతో పాటు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద శనివారం నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

జమ్మికుంట: పట్టణంలోని మేదరివాడ గణనాథుడికి మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, రాధిక దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు.

మానకొండూర్: మండల కేంద్రంలోని శ్రీభక్తాంజనేయ దేవాలయంలో శనివారం ఎంపీటీసీ కవిత ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

శంకరపట్నం: వినాయక నిమజ్జనం శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై లక్ష్మారెడ్డి అన్నారు. వంకాయగూడెంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల నిర్వాహకులతో ఎస్సై మాట్లాడారు.



అల్గునూర్‌లో పూజలు చేస్తున్న మహిళలు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ స్కూల్ వినాయక మండపం వద్ద శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి వినాయకునికి పూజలు, నైవేద్యం సమర్పించారు.

గంగాధర: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద శనివారం నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

తిమ్మాపూర్: మండలంలో మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు, అనంతరం అన్నదానం చేశారు. అల్గునూర్ అంబేద్కర్‌నగర్‌లో నిర్వహించిన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

♦ పౌష్టికాహారంపై అవగాహన

హుజూరాబాద్: పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో పోషణ మాసంపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. గ్రామీణ మండల సమాఖ్య సమితి ఆధ్వర్యంలో మహిళలకు పౌష్టికాహారం ప్రాముఖ్యత వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, రక్తహీనతకు గురికాకుండా కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీడీపీఓ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్ తిరుమల, ప్రిన్సిపాల్ మీనాక్షి, కుమారస్వామి, ఏపీఎం తిరుపతి, పోషన్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు, బ్లాక్ కోఆర్డినేటర్ నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చొప్పదండి: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట స్వశక్తి మహిళలు మానవ హారం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కలిగించారు. ఏసీడీపీవో సౌందర్య, సూపర్‌వైజర్ రమాదేవి, ఐకేపీ ఏపీఎం నర్మద, సీసీలు చంద్రనారాయణ, లక్ష్మణ్, శ్రీనివాస్, పర్శరాములు, ఎంఎస్‌ఏ రేణుక ఉన్నారు.

మానకొండూర్: కొండపల్కల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవం నిర్వహించారు. పిల్లలకు, తల్లులకు పోషకాహారం, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేశారు.

రామడుగు: మండలంలోని వెదిర గ్రామం కేజీబీవీలో పోషణమాసం పురస్కరించుకొని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోరబాలికలకు రక్త హీనతపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుధారాణి, జయప్రద మాట్లాడుతూ.. బాలికలు ప్రధానంగా ఐరన్ ఉన్న ఆహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను తప్పకుండా పాటించాలని సూచించారు. ఈసందర్భంగా పోషణ మాసం కార్యక్రమంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రత్యేకాధికారి కవిత, అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

♦ గుండెపోటుతో ఉపసర్పంచ్ మృతి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లి ఉప సర్పంచ్ చొక్కారావు గుండెపోటుతో శనివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మధ్యాహ్నం గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. చికిత్స కోసం తరలిస్తుండగా మృతి చెందారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. మృతిపట్ల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు సానుభూతి తెలిపారు.

♦ ఎలుగుబంటిని బంధించాలి

గన్నేరువరం: గ్రామంలో సంచరిస్తున్న ఎలుగుబంటిని బంధించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుర్ర అంజయ్యగౌడ్ అన్నారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ.. ఎలుగుబంటి ఇరవై రోజులుగా గ్రామంలో ఏదో ఒక చోట సంచరిస్తోందని, ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఫారెస్ట్ అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

♦ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: మంచి ఉద్యోగం సాధించాలంటే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అంతర్జాతీయ సంస్థ స్మార్ట్ కుకీస్ ముఖ్య కార్య నిర్వాహణ అధికారి అవినాశ్ కులకర్ణి అన్నారు. మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్రిన్సిపల్ డాక్టర్ కందుకూరి శంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సాంకేతికత, కంప్యూటర్ ప్రోగ్రాంలపై అవగాహన పెంచుకోవాలని, సాధ్యమైనంత వరకు ఇంటర్న్యూ ఉండే ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. వివిధ విభాగాల అధిపతులు, కళాశాల రిజిస్ట్రార్ పి.వెంకటయ్య, ఉపాధి శిక్షణ అధికారి, అకాడమిక్ కోఆర్డినేటర్, అధ్యాపక సమన్వయకర్తలు, స్మార్ట్ కుకీస్ ప్రతినిధులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

♦ సంక్షేమ పథకాలు అందించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం

జమ్మికుంట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమైందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న అన్నారు. శనివారం పట్టణంలోని స్వగృహంలో మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం, గృహలక్ష్మి, బీసీ, మైనార్టీ బంధు పథకాలను హుజూరాబాద్ నియోజకవర్గంలో అమలు చేయలేదన్నారు. ఎన్నికల దృష్ట్యా మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేయబోయే పథకాలను హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో గడపగడపకూ తీసుకెళ్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని అన్నారు. నియోజకవర్గ మైనార్టీ సెల్ చైర్మన్ సలీంపాషా, సీనియర్ నాయకులు శంకర్, రాజమౌళి, శ్రీనివాస్, రంజిత్‌రెడ్డి, ప్రభుదాస్, మురళి, మహేందర్ పాల్గొన్నారు.

♦ విద్యార్థులకు ఫౌండేషన్ చేయూత

గన్నేరువరం: పేద విద్యార్థుల చదువు కోసం గన్నేరువరంకు చెందిన, కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కొనగాల ఫౌండేషన్ చైర్మన్ మహేశ్ చేయూత అందించారు. కరీంనగర్‌కు చెందిన ఓ నిరుపేద కుటుంబంలోని ముగ్గురు పిల్లల విద్యాభ్యాసం కోసం నగదు అందజేశారు. తల్లిదండ్రులు పిల్లలకు చదువుకు దూరం చేయవద్దన్నారు.

♦ ఆర్థికసాయం అందజేత

ఇల్లందకుంట: మండలంలోని బూజునూరు గ్రామానికి చెందిన కటంగూరి కృష్ణారెడ్డి ఇటీవల మృతిచెందారు. శనివారం ఎంపీపీ పావనివెంకటేశ్ ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.ఐదు వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఎగ్గటి జగన్, బీఆర్‌ఎస్ నాయకులు బూరుగుల ఐలయ్య, దివాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సరోజన రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాకకుచెందిన ఇల్లందుల రాజమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబానికి వొడితెల రాజేశ్వర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా యువనాయకుడు వొడితెల ప్రణవ్ రూ. పదివేలు అందజేశారు.

♦ గొల్లపల్లిలో గడపగడపకూ కాంగ్రెస్

తిమ్మాపూర్: పల్లె పల్లెకు కవ్వంపల్లి – గడపగడపకూ కాంగ్రెస్‌లో భాగంగా తిమ్మాపూర్ మండలం గొల్లపల్లిలో జిల్లా కార్యదర్శి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం పాదయాత్ర చేశారు. కాంగ్రెస్ గ్యారెంటీలను డీసీసీ అధ్యక్షుడు డా.కవ్వంపల్లి సత్యనారాయణ వివరించారు. అనంతరం పలువురు కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు రమణారెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు ఎస్ఎల్ గౌడ్, ఎంపీటీసీ రమేష్, గొల్లపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

♦ బీఎస్పీలో చేరిక

మానకొండూర్: మండలంలోని కొండపల్కలకు చెందిన గౌడ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు రంగు సంపత్‌గౌడ్ శనివారం బీఎస్పీలో చేరారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



వీణవంక: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1977–78 పదోతరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి స్మృతులను నెమరువేసుకున్నారు. రూ.25వేలతో నిర్మించిన కిచెన్ షెడ్డును ప్రారంభించారు. అనంతరం వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో రాణిస్తున్న విద్యార్థులకు నగదు ప్రోత్సహకాలు అందించారు. సాంఘికశాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయుడు ముల్కల కుమార్ చేస్తున్న సేవలను గుర్తించి పూర్వ విద్యార్థుల కన్వీనర్ సురోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం పులి అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.